క్లుప్తంగా

గీత కార్మికుడికి ఆర్థిక సాయం



లోవరాజుకు ఆర్థిక సాయం అందజేస్తున్న యువకులు

ఎస్.రాయవరం: నిస్సహాయులకు చేయూత అందివ్వడంలో కలిగే ఆనందం వెలకట్టలేనిదని తిమ్మాపురం గ్రామానికి చెందిన బాబూరావు మాస్టారు అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పెదగుమ్ములూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు పోలవరపు లోవరాజుకు తిమ్మాపురం, గోకులపాడు, సైతారుపేట, ఎస్.రాయవరం గ్రామాలకు చెందిన పలువురు యువకులు కలిసి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బాబూరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రసాదుల గణేష్, మత్తి కార్తీక్, పులి సత్తిబాబు, వంగలపూడి నానాజీ, పెరుమాళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి



కె.వెంకటాపురంలో డ్రైనేజీలో పూడిక తీస్తున్న కార్మికుడు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో ఆదివారం పారిశుధ్యం డ్రైవ్ నిర్వహించారు. గ్రీన్‌అంబాసిడర్లు పలు వీధుల్లో చెత్తను తొలగింపజేసి, డ్రైనేజీల్లో పూడికలు తీశారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా ప్రతీ ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. పారిశుద్ధ్య మెరుగుకు సహకరించాలని, జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగస్తులు కావాలని కోరారు.

ప్రత్యక్ష నారాయణుడికి ప్రత్యేక పూజలు



భక్తుల పూజలందుకున్న సూర్య భగవానుడు

నక్కపల్లి: మాఘ మాసం తొలి ఆదివారం సందర్భంగా పలు గ్రామాల్లో సూర్యభగవానుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆవుపేడ పిడకలపై ఆవుపాలతో తయారుచేసిన పరమాన్నాన్ని నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా సూర్యనమస్కారాలు, ఆదిత్యకవచం, సూర్యదండకాలతో ప్రత్యక్ష దైవానికి పూజలు నిర్వహించారు. మాఘమాసంలోనే వసంత పంచమి, రథసప్తమి రావడంతో సూర్యభగవానుడిని ప్రత్యేకంగా పూజిస్తారు. సూర్యనమస్కారాలు, సూర్యభగవానుడిని ఆరాధించడం వల్ల చక్కని ఆరోగ్యం సిద్ధిస్తుందనేది భక్తుల నమ్మకం. నెలరోజుల పాటు పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నారు.

84వ రోజు కొనసాగిన నేవీ నిర్వాసితుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న నేవీ నిర్వాసితులు

రాంబిల్లి: నేవీ నిర్వాసితుల ధర్నా ఆదివారం 84వ రోజు కొనసాగింది. వాడనర్సాపురం, కొత్తపట్నం, కొప్పుగొండుపాలెం, వాడపాలెం, నేవీ పునరావాసకాలనీ, గోవిందపాలెం, కొత్తపేట, చినకలవలాపల్లి గ్రామాల ప్రజలు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

అంతర్జాతీయ చిరుధాన్యాల సదస్సు రేపు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 24న అంతర్జాతీయ చిరుధాన్యాల సదస్సు నిర్వహించనున్నట్టు శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ కార్యదర్శి జోగినాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సదస్సుకు నాబార్డు అధికారులు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు.

ఆ జ్ఞాపకాలు.. మధురాతి మధురం

- పలు ప్రాంతాల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆచార్యులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



భవానీ స్కూల్‌లో సందడి చేసిన పూర్వ విద్యార్థులు

పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాలోని పలు ప్రాంతాల్లో పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను పంచుకుని సందడి చేశారు.

నక్కపల్లి: ఏళ్లు గడిచినా స్నేహబంధం ఎప్పటికీ మధురమే. ఆ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వవిద్యార్థుల సమ్మేళనానికి నక్కపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1976–77 సంవత్సరంలో పదోతరగతి చదివిన వారంతా ఆదివారం కలుసుకుని, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. తాము ఈ పాఠశాలలో చదివిన రోజులను, గడిపిన సమయాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. అనంతరం విందుభోజనాల కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రంగసాయి, ప్రకాశరావు, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు గ్రహీత ఎన్.వి.ఎస్. ఆచార్యులను ఘనంగా సన్మానించారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులైన విశ్రాంత వీఆర్వో డి.వి రామారావు, విశ్రాంత పోస్టుమాస్టర్ ఎన్.గోపాలాచార్యులు, నూకయ్యశెట్టి, రావుగోపాలకృష్ణ, మంచాల రమణ, అల్లు సత్యనారాయణ, శ్రీధరాల నాగేశ్వరరావు, పచ్చిపులుసు హనుమంతరావు, నరిశే వెంకటాద్రి, అబ్దుల్ అజీవ్ తదితరులుపాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

పాయకరావుపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984–85 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో కలుసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. విశ్రాంత, సీనియర్ ఉపాధ్యాయులు ఐ.సోమయాజులు, కె.ఆర్.జె.శర్మ, కె.ప్రభాకరరావు, జె.సుందరం, సుబ్రహ్మణ్యం, కె.సత్యనారాయణలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మామిడి వెంకటేశ్వరరావు, ధనిశెట్టి బుజ్జి, ఆకాశపు నాగేశ్వరరావు, పులగ గురునాథం, వెలగ అప్పారావు, కొశిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం మండలంలో...

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో 1989–90వ సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక భవానీ స్కూల్‌లో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కూండ్రపు మూర్తి ప్రసాద్, బ్రహ్మం, బాబ్జి, లంకాడ శ్రీనివాసరావు, మత్తుర్తి శ్రీను, కిరణ్, డి.అప్పలనాయుడు, చోడపల్లి అప్పలనాయుడు, రాజాన తాతారావు, పంచదార్ల రాము తదితరులు పాల్గొన్నారు.

కొండకర్ల ఆవ వద్ద ..

అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో 2003–04లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం కొండకర్ల ఆవ వద్ద కలుసుకున్నారు. ఉదయం నుంచి ఆహ్లాదంగా గడిపారు. సమీపంలో ఉన్న ఇచ్ఛా ఫౌండేషన్‌కు రూ.ఐదు వేల నగదు, రెండు నెలలకు సరిపడా రేషన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.ప్రసాద్, అప్పారావు, వి.అనిల్, టింకు, ఎన్.రమణ, చిన్నారావు, బాబ్జి, సన్యాసినాయుడు, శ్రీను, సాహితి, భవానీ తదితరులు పాల్గొన్నారు.



పాయకరావుపేట ఉన్నతపాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఘనంగా మంత్రి అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు



కైలాసపట్నంలో మంత్రి అమర్‌నాథ్ జన్మదిన వేడుకలో పాల్గొన్న జెడ్పీటీసీ ఉమాదేవి తదితరులు



మంత్రి అమర్‌నాథ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న చిక్కాల తదితరులు

కోటవురట్ల: మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జన్మదిన వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కైలాసపట్నంలో జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శెట్టి రమణ, శానాపతి రామునాయుడు, మేడిశెట్టి నానాజీ, చామంతుల శ్రీనివాసరావుతదితరులుపాల్గొన్నారు.

పాయకరావుపేట: మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు పాయకరావుపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాలరావు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు మంత్రి నివాసానికి వెళ్లి కేక్ కట్‌చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దనిశెట్టి బాబూరావు, ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ రాజేష్ ఖన్నా, జగతా శ్రీను, వర్మరాజు, కోడ కోటేశ్వరరావు, అన్నవరం,జి.శ్రీను పాల్గొన్నారు.

నక్కపల్లి నుంచి...

శుభాకాంక్షలు తెలిపిన వారిలో నక్కపల్లి నుంచి కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌లు యలమంచిలి తాతబాబు, పార్టీనాయకులు శీరంనర్సింహమూర్తి, సూరాకాసుల గోవిందు, తళ్ల భార్గవ్, గొర్ల గోవిందు, బి.బాబ్జి తదితరులు ఉన్నారు.

మునగపాక: ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తరలివెళ్లి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు పాలకవర్గ సభ్యులతో కలిసి మింది వెళ్లి అమర్‌నాథ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

275 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 275 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 202 మందికి కళ్లద్దాలు, 44 మందికి మందులు పంపిణీ చేశారు. 19 మందికి కాటరాక్ట్ సర్జరీ అవసరమని వైద్యులు సూచించారు. శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి వచ్చిన వారికి ఫలహారం, మజ్జిగ, మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని కల్పించారు. ప్రజల ఆరోగ్యానికి అండగా ఉండాలనే లక్ష్యంతో ఇటువంటి శిబిరాలను నిర్వహిస్తున్నామని, ఆదివారం 99వ శిబిరం నిర్వహించామని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి తెలిపారు.

మామిడిలో అంతర పంటగా టమాటా



అంతర్ పంటగా సాగుచేస్తున్న టమాటా

కె.కోటపాడు: మండలంలోని మెట్ట గ్రామాల్లో రైతులు అంతర పంటల సాగు విధానంపై ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా రైతులు అధిక విస్తీర్ణంలో మామిడి సాగు చేపడుతున్నారు. ఈ పంట ఖాళీ ప్రదేశాల్లో అంతర పంటగా కూరగాయలతోపాటు ఆకుకూరలను సాగు చేస్తున్నారు. తక్కువ కాల వ్యవధిలో, తక్కువ పెట్టుబడితో సాగయ్యే టమాటా పంటను పాతవలస, గొట్లాం, సూదివలస, శృంగవరం, మర్రివలస ప్రాంతాల్లో 50 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మామిడితోపాటు అంతర పంటగా టమాటా సాగు చేయడం వల్ల అదనపు ఆదాయాన్ని సాధిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

ఘనంగా తీర్థాలు



ఎస్.రాయవరం: తీర్థంలో ఏర్పాటు చేసిన దుకాణాలు



రాంబిల్లి: కబడ్డీ పోటీలో తలపడుతున్న యువతులు



కోటవురట్ల: సీతారాములను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు

ఎస్.రాయవరం: మండలంలోని సర్వసిద్ధిలో ఆదివారం ఘనంగా తీర్థం నిర్వహించారు. సంక్రాంతి తరువాత గ్రామాల్లో పెద్ద ఎత్తున తీర్థాలు నిర్వహిస్తారు. అందులో భాగంగా సర్వసిద్ధిలో ఈ జాతర నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపుల వివిధ సామగ్రి విక్రయించే దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రాంబిల్లి: మండలంలో లాలంకోడూరులో ఆదివారం లాలం ఎరికి రెడ్డినాయుడు తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లాలం భాస్కరరావు కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఏటా ఈ తీర్థాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మహిళా కబడ్డీపోటీలు, పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

కోటవురట్ల: కై లాసపట్నంలో సీతారాముల తీర్థ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, మేడిశెట్టి నానాజీ, పెన్నాడ రాంబాబు, చామంతుల శ్రీనివాసు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవం

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల మహోత్సవం శనివారం అర్ధరాత్రి దాటిన వరకు జరిగి, ఘనంగా ముగిసింది. అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతి కార్యక్రమాలు జాతరకు వచ్చిన ప్రజలను ఆకట్టుకున్నాయి. శారదానది వంతెన నుంచి పెరుగులబజారు కూడలి వరకు ప్రధాన రహదారి జనంతో కిక్కిరిసింది. ఎన్టీఆర్ క్రీడామైదానంలో మందుగుండు సీతారామయ్య బాణసంచా విన్యాసాలు ఆకర్షించాయి. పట్టణ సీఐ దాడి మోహన్ ఆధ్వర్యంలో భారీగా పోలీసు బలగాలు బందోబస్తు నిర్వహించాయి.



బాణసంచా విన్యాసాలు

ముగ్గురు పందెం రాయుళ్ల అరెస్టు

ఎస్.రాయవరం: మండలంలోని సర్వసిద్ధి గ్రామంలో ఆదివారం కోడిపందాలు ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ ప్రసాద్‌రావు తెలిపారు. గ్రామంలో కోడిపందాలు ఆడుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడిచేశామన్నారు. కోడిపందాలు ఆడుతున్న వారిలో కొందరు పరారవగా ముగ్గురు పట్టుబడ్డారని చెప్పారు. వీరి వద్ద నుంచి రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం విజేత ఎం.కొత్తపల్లి

దేవరాపల్లి: కొత్తపెంటలో పైడిమాంబ అమ్మవారి తీర్థం పురస్కరించుకొని ఆదివారం జిల్లా స్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించారు. పది ఎడ్ల బళ్ల మధ్య పోటీ హోరా హోరీగా సాగింది. ఇందులో విజేతగా ఎం.కొత్తపల్లికి చెందిన సంబారు గాయత్రి ఎడ్లు నిలిచాయి.

ఎం. కోటపాడు పాచిల నాగరాజు ఎడ్లు ద్వితీయ, నర్సయ్యపేట ముమ్మిన రామకృష్ణ ఎడ్లు తృతీయ స్థానాలను దక్కించుకున్నాయి. లక్కవరం మోదమాంబ ఎడ్లు నాల్గు, మంగళాపురం సిద్ధివినాయక ఎడ్లు ఐదు, కొత్తపెంట రొంగలి రవితేజ ఎడ్లు ఆరో స్థానాల్లో నిలిచాయి. వీరికి రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు, రూ. వెయ్యి చొప్పున నగదు బహుమతులను వైఎస్సార్‌సీపీ నాయకుడు రొంగలి వెంకటరావు, దాతలు, గ్రామ పెద్దలు ప్రదానం చేశారు.

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నేడు

ములకలాపల్లిలో పైడిమాంబ, ముత్యమాంబ, మరిడిమాంబ అమ్మవార్లు, అచ్చియ్యమ్మ పేరంటాలు తీర్థం పురస్కరించుకొని సోమవారం జిల్లా స్థాయి ఎడ్ల పోటీలను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ గొర్లె అన్నపూర్ణ, ఎంపీటీసీ మజ్జి దేవి తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.15 వేలు, రూ. 12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ. 2వేలు, రూ.వెయ్యి చొప్పున వరుసగా బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష



మునగపాక ఎంఎస్‌ఆర్ కళాశాల వద్ద వేచి ఉన్న అభ్యర్థులు



సూచనలిస్తున్న పరవాడ డీఎస్పీ శ్రీనివాసరావు

మునగపాక: పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. స్థానిక ఎంఎస్ఆర్ డిగ్రీకళాశాల, తిమ్మరాజుపేటలోని డావిన్సీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన పరీక్షకు 540 మందికి గాను 510మంది హాజరయ్యారు. పరవాడ డీఎస్పీ శ్రీనివాసరావు, సబ్బవరం సీఐ రంగనాథన్, ఎస్‌ఐ భీమరాజు బందోబస్తు నిర్వహించారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలో ఆదివారం నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా ముగాశాయి. ఏఎస్పీ విజయ్ భాస్కర్, డీఎస్పీ శ్రీనివాసరావు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ప్రశాంతి విద్యా సంస్థలో 600 మందికి గానూ 552 మందికి పరీక్షకు హాజరయ్యారు. కైట్స్ విద్యా సంస్థలో 240 మందికి గానూ 218 మంది పరీక్షకు హాజరయ్యారు.

నవోదయ నమూనా పరీక్షకు విశేష స్పందన



నవోదయ నమూనా పరీక్షకు హాజరైన విద్యార్థులు

మునగపాక: స్థానిక సంతబయిల గౌతమపఠన మందిరం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి నవోదయ పరీక్షకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. 312 మంది విద్యార్థులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మందిర అధ్యక్ష, కార్యదర్శులు దాడి సూరిబాబు, వెలగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించేందుకు ఇటువంటి నమూనా పరీక్షలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏవీఎస్ మూర్తి, శివకోటి దుర్గా ప్రసాద్, పిల్లా జగదీష్, మందిర సభ్యులు ఆడారి పరశురామ్, దాడి అప్పలనాయుడు, ఆడారి లక్ష్మణరావు, కుంది సూర్యనారాయణ, బూడిద రామారావు, నేషనల్ ఐటీఐ కరస్పాండెంట్ మళ్ల జోగారావు పాల్గొన్నారు.

వైభవంగా భరతమాతకు పూజ



మాట్లాడుతున్న ఎస్ఎస్ఎఫ్ జిల్లా ధర్మ ప్రచారక్ సత్యనారాయణ



కొండవారపాలెంలో ధర్మప్రచారం చేస్తున్న సమరసత ఫౌండేషన్ సభ్యులు

కోటవురట్ల: భరతమాతను ప్రతీ పౌరుడు పూజించాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో జల్లూరు, యండపల్లి గ్రామాల్లో భరతమాత పూజా కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ భారతదేశం వేదాలు, సనాతన ధర్మం, సంస్కృతీసంప్రదాయలకు పుట్టినిల్లు అని చెప్పారు. ఆచారాలు, సంస్కృతిని పాటించడం ద్వారా శాంతి మార్గం అలవడుతుందన్నారు. ధర్మాన్ని అనుసరించడం ద్వారా మానవతా విలువలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ మద్దు జోగిరాజు, కమిటీ సభ్యుడు తమరాన రమణ, గ్రామ ధార్మిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాంబిల్లి: కొండవారపాలెంలో ఆదివారం ధర్మప్రచారం నిర్వహించారు. సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మ ప్రచారంలో ధర్మ పరిరక్షణ ఆవశ్యకతను ఫౌండేషన్ డివిజన్ కన్వీనర్ అప్పారావు వివరించారు. ఈ కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్‌మండలకన్వీనర్ నూకరాజు పాల్గొన్నారు.

జోరుగా వరి నూర్పులు



వరి నూర్పిడిలో నిమగ్నమైన రైతు



గాలిపోత పనుల్లో అన్నదాతలు

రాంబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వరి నూర్పులు జోరుగా జరుగుతున్నాయి. యంత్రాలతో పాటు ఎడ్ల సాయంతో నూర్పిడి నిర్వహిస్తున్నారు. యంత్రాలు, ట్రాక్టర్ల సాయంతో ఎక్కువగా పనులు చేస్తున్నారు. పలుచోట్ల పాత పద్ధతుల్లో ఎడ్ల సాయంతో కూడా నూర్పులు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సుమారు 6వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. వరి నూర్పులు పూర్తి చేసిన రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నారు.

ఈ ఏడాది మండలంలో ఆర్‌జీఎల్, ఎంటీయూ 1224, ఎంటీయూ 1262తో పాటు ఇంద్ర, సాంబ మసూరి వంటి రకాలను రైతులు సాగు చేశారు. గత ఏడాది వరకు దాదాపు 80 శాతం మంది రైతులు ఆర్‌జీఎల్ రకాన్నే సాగు చేశారు. సుదీర్ఘ కాలంగా ఆర్‌జీఎల్‌ను సాగు చేయడం కారణంగా దిగుబడులు తగ్గిపోవడంతో రైతులు ఇతర రకాలపై దృష్టిసారించారు.

1 నుంచి 5 వరకు దేవీతల్లి తీర్థం

దేవరాపల్లి: స్థానిక ప్రజల ఆరాధ్య దైవం ఉమామహేశ్వరి దేవి (దేవీతల్లి) తీర్థం వచ్చే నెల 1 నుంచి 5వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ మేరకు ఆలయంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఐదు రోజులు పాటు జరిగే తీర్థం సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుపై చర్చించారు. ఆఖరి రోజు 5న భారీ సంఖ్యలో హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు లేకుండా చేయాల్సిన ఏర్పాట్లుపై సైతం సమాలోచనలు చేశారు. సమావేశంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, కల్లుగీత డైరెక్టర్ సిమ్మ అప్పన్న, వరదపురెడ్డి లలితానాయుడు, ఎల్లేటి కరుణాకరరావు, ఆలయ ధర్మకర్త లలితా ప్రసాద్, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు, వేచలపు అప్పలనాయుడు, పేరునాయుడు, వాలేటి నాగరాజు, కె.వి.రమణ పాల్గొన్నారు.



ఆలయంలో సమావేశమైన గ్రామ పెద్దలు

నేడు సుభాష్ చంద్రబోస్ తీర్థం

మాడుగుల రూరల్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా కె.జె.పురంలో సోమవారం తీర్థం నిర్వహిస్తున్నట్లు నేతాజీ సోల్జర్స్ (2007–2008) బ్యాచ్ విద్యార్థులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఇక్కడ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఉదయం జెండా వందనం, దేశభక్తి గీతాలు ఆలాపన ఉంటుందన్నారు. అనంతరం సాయంత్రం ముగ్గులు, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.